క్లుప్తంగా

పొంగి పొర్లుతున్న కళింగ

జి.కొండూరు: వెల్లటూరు పడమర చెరువు కళింగ పొంగి పొర్లుతోంది. గత ఏడాది బుడమేరుకు వచ్చిన వరద ఉప్పెనతో ఈ చెరువుకు నాలుగు చోట్ల భారీ గండ్లుపడి చెరువులో నీరంతా దిగువకు వెళ్లిపోయింది. ఆ తర్వాత ఈ ఏడాది జూన్ నెలలో గండ్లను పూడ్చడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు చెరువు నిండింది. జి.కొండూరు మండల పరిధిలోని అతి పెద్ద చెరువుగా ఉన్న ఈ చెరువు 260ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు కింద 1,250ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. ప్రస్తుతం పడమర చెరువు సాగునీటితో నిండు కుండలా దర్శనమిస్తున్న నేపథ్యంలో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జెడ్పీటీసీకి సత్కారం

మునుసూరు: వైఎస్సార్ సీపీ ఉపాధ్యాయ ఫెడరేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ పదవికి ఎంపికైన ముసునూరు జెడ్పీటీసీ డా.వరికూటి ప్రతాప్‌ను మంగళవారం లోపూడిలో స్థానిక పెద్దలు, యూత్ కమిటీ సభ్యులు సన్మానించారు. వైస్ ఎంపీపీ కోటగిరి రాజానాయన, సర్పంచ్ పేరం కృష్ణ, మాజీ ఎంపీటీసీ ఎల్.గోపాల్, వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఎంపీపీ కొండా దుర్గాభవాని, మండల పార్టీ అధ్యక్షుడు మూల్పూరి నాగవల్లేశ్వరరావు తదితరులు జెడ్పీటీసీని అభినందించారు.

విద్యుత్ కోతలతో ఇక్కట్లు

ఆగిరిపల్లి: విద్యుత్ కోతలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రవికుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆగిరిపల్లి ఎస్ఎఫ్ఎస్ హైస్కూల్లో 500 మంది విద్యార్థులు చదువుతున్నారని, గత 20 రోజులుగా ప్రతి రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు ఉక్కపోతతో అల్లాడిపోయారన్నారు. ఇదే విషయమై విద్యుత్ ఏఈని సంప్రదించగా విద్యుత్ లైన్లను పునరుద్ధరిస్తున్నామని, అందుకే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

యూరియా కోసం ఇండెంట్ పెట్టాం

తిరువూరు: 'యూరియా కోసం రైతుల తిప్పలు' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన వార్తకు తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ స్పందించారు. సొసైటీ పరిధిలో 3,804 ఎకరాల్లో వరి సాగవుతున్నందున రైతులందరికీ సరిపడా యూరియా అందించేందుకు ఇప్పటికే ఇండెంట్ పెట్టామని, రైతులందరికీ అందిస్తామని చెప్పారు.

పశువులకు టీకాలు

జి.కొండూరు: నాలుగు నెలల వయస్సు దాటిన ప్రతి పశువుకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ హనుమంతురావు అన్నారు. జి.కొండూరులో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. టీకాలు వేయించకపోతే పశువులు గాలికుంటు వ్యాధి భారిన పడి పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 15వ తేదీ వరకు జరుగుతుందని చెప్పారు. పశువు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ హరిహరనాథ్, మండల పశు వైద్యాధికారి డాక్టర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

స్వచ్ఛతపై చిత్తశుద్ధి ఏదీ?

- ఖాళీ స్థలాల్లో మురుగునీటి నిల్వలు
- వృద్ధిచెందుతున్న దోమలు
- వ్యాధులు వ్యాపించే ప్రమాదం
- భయాందోళనలో ప్రజలు




నూజివీడు మొఘల్ చెరువు లోపలి భాగంలో దర్శనమిస్తున్న మురుగునీటి తటాకం : నూజివీడు న్యూ ఎంప్లాయిస్ కాలనీలోని ఖాళీ స్థలంలో నిల్వ ఉన్న నీరు

నూజివీడు: స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర అంటూ ప్రతి నెలా మూడో శనివారం ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమం ప్రచారార్భాటానికి తప్ప నూజివీడు పట్టణంలో మార్పేమీ ఉండటం లేదు. నూజివీడు పట్టణంలోని పలు వార్డులను మురుగునీటి సమస్య వెంటాడుతోంది. వీధుల మధ్యలో, ఇళ్ల ఎదుట మురుగునీటి గుంతలు ఏర్పడి దుర్వాసన వెదజల్లుతున్నాయి. రోడ్డుపైనే నిల్వ ఉంటున్న మురుగునీటిలో నుంచే ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. డ్రెయిన్లలో ఎక్కడి మురుగునీరు అక్కడే నిలిచిపోతోంది. వర్షాకాలం కావడంతో పరిస్థితి మరింత దారుణంగా మారింది. మురుగునీటి నిల్వల కారణంగా జ్వరం, కీళ్ల నొప్పులు, దగ్గు, జలుబు తదితర లక్షణాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఖాళీ స్థలాలు వర్షం నీరు నిల్వ ఉండి దోమలు, ఈగల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. నూజివీడులోని ఎమ్మార్ అప్పారావు కాలనీలో మలేరియా అనుమానిత కేసులు నమోదవుతుండటంతో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు నియోజకవర్గంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉన్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్రచారార్భాటంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

గత ఏడాది సెప్టెంబర్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం ప్రభుత్వం నిర్వహించింది. ఆ తరువాత నుంచి ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమాల నిర్వహణను అధికార పార్టీ నాయకులు, అధికారులు ఫొటోలు దిగడానికి, ప్రచారం కోసం తప్పితే చిత్తశుద్ధి కనిపించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పట్టణంలోనే మురుగునీటి నిల్వలు పెద్ద ఎత్తున ఉంటే ఎలాగని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోని ఏ వార్డులో చూసినా రోడ్ల వెంబడి మురుగునీటి గుంతలు, ఖాళీ స్థలాలు మురికికూపాలుగా మారి దోమలు పెరిగి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

మురుగు నిల్వలు లేకుండా చూడాలి



పట్టణంలోని పలు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో మురుగునీటి నిల్వలు లేకుండా చూడాలి. డ్రెయిన్లలో చెత్తచెదారం పడి ఏర్పడే అడ్డంకులను తొలగించాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. వర్షాకాలం కావడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది.

– చాట్ల పుల్లారావు, నూజివీడు

చర్యలు తీసుకుంటాం



వార్డుల్లోని డ్రెయిన్లు, ఖాళీ స్థలాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. శానిటేషన్ సిబ్బందితో మురుగునీటిని బయటకు వెళ్లగొట్టిస్తాం. డ్రెయిన్లలో చెత్తచెదారం వేయకుండా ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలి. పల్లంగా ఉన్న ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇస్తాం.

– ఆర్. వెంకటరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, నూజివీడు


మైలవరంలో గాయత్రీ దేవిగా అమ్మవారు



తిరువూరు పోలీసు స్టేషన్ ఆవరణలో అమ్మవారు


తిరువూరు శ్రీరామలింగేశ్వ రాలయంలో అమ్మవారు


కొటికలపూడిలో గాయత్రీ దేవిగా దర్శనం


జి.కొండూరులో గాయత్రీ దేవిగా అమ్మవారు


బలివేలో లలితా త్రిపుర సుందరి దేవిగా..


శ్రీ కోట మహిషాసుర మర్దని అమ్మవారు

గాయత్రీ దేవి..నమోస్తుతే

తిరువూరు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు తిరువూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. తిరువూరు పట్టణంలోని శ్రీ కనక దుర్గాలయం, శ్రీ చంద్రమౌళీశ్వరాలయం, శ్రీ రామలింగేశ్వరాలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపం, కూరగాయల మార్కెట్, షిర్డీ సాయి మందిరం, సత్య సాయి మందిరం, శ్రీ గౌరీ కేదారేశ్వరస్వామి దేవస్థానం, శ్రీ అష్టలక్ష్మీ ఆలయం, రాజుపేటలలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. తిరువూరు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో సిబ్బంది అమ్మవారికి పూజాదికాలు జరిపారు. గంపలగూడెం మండలం ఊటుకూరు కోదండ రామాలయం, గంపలగూడెం రామాలయం వీధిలోని నవరాత్రి పందిరి, ఊటుకూరు దుందిరాలపాడు రోడ్డులోని ఉత్సవ పందిళ్లలో దసరా వేడుకలను నిర్వహిస్తున్నారు. ఎ.కొండూరు మండలం కంభంపాడు, గోపాలపురం, ఎ.కొండూరులలో దసరా వేడుకలు జరుగుతున్నాయి.

- **మైలవరం:** మైలవరంలో ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో అమ్మవారు మంగళవారం గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. స్థానిక ఆర్ అండ్ బీ కార్యాలయం వద్ద, సొసైటీ బ్యాంక్ సెంటర్, తిరువూరు రోడ్డులోని శ్రీ పాండురంగస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన పందిళ్లలో అమ్మవార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ

మైలవరం: దసరా ఉత్సవాల సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ ఏడాది అమ్మవారు 11 అలంకారాల్లో దర్శనమిస్తారని వివరించారు. పండుగ విశిష్టతను తెలిపారు. పాఠశాల కార్యదర్శి జంజనం రాధా కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **జి.కొండూరు:** స్థానిక బీసీ కాలనీలో కనకదుర్గమ్మ అమ్మవారి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని మంగళవారం గాయత్రీ దేవిగా అలంకరించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.
- **విస్సన్నపేట:** స్థానిక ద్వారకానగర్‌లోని కనక దుర్గ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు, పుత్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలోని అమ్మవారు మంగళవారం గాయత్రీ దేవిగా పూజలందుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి పందిళ్ల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి.

గాయత్రీదేవిగా అమ్మవార్ల దర్శనం

ఇబ్రహీంపట్నం: మండలం పరిధి గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం దుర్గమ్మ అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కొటికలపూడి గ్రామంలో పంచముఖాలు, పది కళ్లతో దర్శనమిచ్చిన అమ్మవారి రూపం భక్తులకు జ్ఞానాన్ని సూచించే శక్తిని ప్రసాదిస్తుందని అర్చకులు తెలిపారు. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జూపూడి గంగానమ్మ ఆలయం, ఇబ్రహీంపట్నం ప్రసాద్‌నగర్ కనకదుర్గమ్మ ఆలయాల్లో స్థానికులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. పవిత్ర సంగమం వద్ద మున్సిపల్ వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్ దంపతులు అమ్మవారికి పూజలు చేశారు. మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు పాల్గొన్నారు. కొండపల్లి, గుంటుపల్లి, కిలేశపురంలోని ఆలయాలు, చలువు పందిళ్లలో గాయత్రీ దేవికి పూజలు నిర్వహించారు.

గాయత్రీ దేవిగా కోట మహిషమ్మ దర్శనం..

నూజివీడు: పట్టణంలోని శ్రీకోట మహిషాసుర మర్ధని మంగళవారం గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. వేకువజామునే అర్చకులు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజ నిర్వహించారు. భక్తులు తెల్లవారుజాము నుంచే అమ్మవారిని దర్శించుకున్నారు. చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కె. అనురాధ, ఈఓ అలివేణి పర్యవేక్షిస్తున్నారు. అలాగే సరస్వతీ ఆలయంలోను, 32వ వార్డులోని కనకదుర్గమ్మ ఆలయంలోను, కోనేరుపేట టీటీడీ కల్యాణ మండపం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

లలితా త్రిపుర సుందరీ దేవిగా..

- **బలివే(ముసునూరు):** బలివేలోని రాజరాజేశ్వరి అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిచ్చారు. బలే రామలింగేశ్వ స్వామి దేవస్థానంలోని రాజరాజేశ్వరి అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు జరిపారు. లోపూడిలోని కోదండ రామాలయం వద్ద 26 మంది దీక్ష స్వీకరించిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. ముసునూరులోని తూర్పు పడమర, చెక్కపల్లి, రమణక్కపేట శ్రీకోదండ రామాలయాల్లో, అమ్మవారికి పూజలు చేశారు.


మైలవరం లీలావతి పాఠశాల విద్యార్థుల వేషధారణ

- **చాట్రాయి:** దేవి నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు శ్రీ గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చనుబండలో భవానీలు ప్రత్యేక పూజలు జరిపారు.
- **ఆగిరిపల్లి:** స్థానిక రుద్రభూమి వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారిని గాయత్రీ దేవిగా అలంకరించారు. చండీ హోమం, కుంకుమ పూజ నిర్వహించారు. భవానీలకు అన్నదానం చేశారు. దమ్మన్న మండపం, రజక వీధిలో భక్తులు అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈదులగూడెం, వట్టిగుడిపాడులో రామాలయం సెంటర్ కమిటీ ఆధ్వర్యంలో పూజలు చేశారు.
- **భవానీపురం(విజయవాడపశ్చిమ):** రాయనపాడు గ్రామంలోని వసంత వేణుగోపాల స్వామి దేవస్థానంలో అమ్మవారు శ్రీగాయత్రీ దేవి అలంకారంలో పూజలు అందున్నారు.


విస్సన్నపేటలో గాయత్రీదేవిగా..


తిరువూరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో..


వట్టిగుడిపాడు రామాలయం సెంటర్‌లో అమ్మవారు


తిరువూరు శ్రీచంద్రమౌళీశ్వ రాలయంలో గాయత్రీదేవిగా..


రాయనపాడు గ్రామంలో అమ్మవారి అలంకరణ..

ఆ స్థలంలో గుడి నిర్మాణం చేపట్టవద్దు

నూజివీడు సబ్ కలెక్టర్ ఆదేశం

ముసునూరు: కోర్టు ఆదేశాలున్న స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న ఆదేశించారు. మండలంలోని గోపవరం, కాట్రేనిపాడు గ్రామాల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు అందిన వివాదాస్పద స్థలాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. గోపవరం గ్రామానికి చెందిన విష్ణు తదితరులు గ్రామ కంఠంలోని, కొంత స్థలాన్ని కొనుగోలు చేసి, అంకమ్మ దేవర ఆలయ నిర్మాణ ఏర్పాట్లు చేపట్టారు. దీనిపై నివాస గృహాల నడుమ ఆలయ నిర్మాణం చేపట్టవద్దంటూ చిలకంటి వెంకట్రామయ్య మరి కొందరు అభ్యంతరం వ్యక్తం చేసి కోర్టును ఆశ్రయించారు. దీనిపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సైతం ఫిర్యాదు చేశారు. కోర్టు ఆదేశాలు ఉన్న భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదని, తక్షణం పనులు నిలిపి వేయాలని ఆమె ఆదేశించారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

తిరువూరు: మండలంలోని కాకర్ల వద్ద జాతీయ రహదారిపై ఈ నెల 17న ఒక మహిళ మెడలో బంగారు గొలుసు అపహరించిన నిందితులను పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తిరువూరు సీఐ గిరిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కాకర్లకు చెందిన బేబీ సరోజిని ఆటోలో విజయవాడ నుంచి తిరువూరు వస్తుండగా ఆటోలో ఉన్న నలుగురు నిందితులు ఆమెను బెదిరించి మెడలోని 20 గ్రాముల బంగారు నానుతాడు దొంగిలించి పరారయ్యారు. నిందితుల కోసం పోలీసులు గాలించగా తిరువూరు మధిర రోడ్డు వద్ద ఆటోలో అనుమానాస్పదంగా కనిపించిన నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు మరో ఇద్దరు కూడా చోరీలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. వారి నుంచి బంగారం రికవరీ చేసి అరెస్టు చేశారు. నిందితుల్లో పల్నాడు జిల్లా సత్తెనపల్లి, సాతునూరులకు చెందిన జెట్టిపాటి శ్రీనివాసరావు, బండారు ఏడుకొండలు, జెట్టిపాటి రమేష్, లావుడియా శ్రీనివాసరావు నాయక్‌లతో పాటు విజయవాడకు చెందిన ఆటో డ్రైవరు పామర్తి పంగిడయ్య, షేక్ ఆశాజ్యోతి ఉన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషిచేసిన తిరువూరు ఎస్ఐలు సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ తగదు

ఇబ్రహీంపట్నం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రారంభించిన 17 మెడికల్ కళాశాలల్లో 10 మెడికల్ కాలేజీలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని ఉపసంహరించుకోవాలని భారత ఐక్య యువజన సమాఖ్య (యువైఎఫ్ఐ) రాష్ట్ర కన్వీనర్ కాసాని గణేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ పెట్టుబడితో నిర్మించిన కాలేజీలు, హాస్పిటల్స్‌ను ప్రైవేట్ వ్యక్తుల లాభాల కోసం అప్పగించవద్దన్నారు. పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేయవద్దన్నారు.

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

ముసునూరు: మహిళలు, బాలికలు అప్రమత్తంగా ఉండాలని శక్తి టీం సభ్యులు, ఏఎస్ఐ నాగ ఫణి భూషణరావు పేర్కొన్నారు. బలివే గ్రామ సచివాలయం వద్ద శక్తి టీమ్, భూమిక ఉమెన్ కలెక్టివ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం శక్తి యాప్‌ను మహిళల ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

నూజివీడు: వసతిగృహాల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి నాగరాణి పేర్కొన్నారు. పట్టణంలోని బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో డివిజన్‌లోని బీసీ హాస్టల్‌లలోని కుక్‌లకు, వారి సహాయకులకు, గృహ సంక్షేమ అధికారులకు కుకింగ్ శిక్షణ, వసతి గృహ నిర్వహణపై ఒక రోజు శిక్షణ శిబిరాన్ని నిర్వహించి పలు సూచలు చేశారు. డివిజన్‌లోని 11 వసతిగృహాలకు చెందిన అధికారులు, వంట సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి

తిరువూరు ఆర్డీఓ మాధురి



తిరువూరు: త్వరలో ఖరీఫ్ ధాన్యం మార్కెట్లోకి రానున్నందున రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని, వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల సిబ్బంది సమన్వయంతో ఈ ప్రక్రియను విజయవంతం చేయాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి మాధురి పేర్కొన్నారు. తిరువూరు శ్రీ వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ధాన్యం కొనుగోలుపై వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించి రైతుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. రైతులు తమ సొంత వాహనాల్లో ధాన్యం తరలించే అవకాశం కల్పించాలని ఆదేశించారు. ముందు వచ్చిన రైతులకు ధాన్యం సంచుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని, ధాన్యం విక్రయించిన రైతులకు సకాలంలో నగదు అందే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. తిరువూరు తహసీల్దారు ఉదయభాస్కర్, వ్యవసాయాధికారులు పద్మ, టిప్పుసుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపు బిల్లుపై ఆందోళన



విస్సన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పని గంటల పెంపు బిల్లు దుర్మార్గమని సీఐటీయూ మండల కన్వీనర్ ఆకుల శ్రీనివాసరావు అన్నారు. పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ స్థానిక బస్టాండ్ వద్ద మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఖండించారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాడాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి. నాగరాజు, సీఐటీయూ నాయకులు రాము, బాష, అప్పారావు, శివ, సుబ్బారావు పాల్గొన్నారు.

- **తిరువూరు:** కార్మికులకు వేతనాలు పెంచకపోగా, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేయడం దారుణమని సీఐటీయూ తిరువూరు మండల కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికుల పనివేళల పెంపు నిర్ణయాన్ని నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, సురేష్, కార్మికులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

చాట్రాయి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ ఆరోగ్య వైద్యసేవలు అభినందనీయమని ఆరుగొలనుపేట సర్పంచ్ పుచ్చకాయల అప్పిరెడ్డి అన్నారు. స్థానిక సచివాలయంలో మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చాట్రాయి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రీదేవి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు. పోతనపల్లిలో చనుబండ పీహెచ్‌సీ వైద్యాధికారి దుర్గాప్రసాదు రోగులకు వైద్య పరీక్షలు చేశారు.

- **మైలవరం:** స్త్రీని బలోపేతం చేయడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నాయకులు తెలిపారు. ఆరోగ్య సిబ్బంది, కూటమి నాయకులు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.
- **పుత్రేల(విస్సన్నపేట):** పుత్రేల సచివాలయం వద్ద వైద్య శిబిరం ఏర్పాటుచేసి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసరావు బృందం వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. సర్పంచ్ స్వాతి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.